


గురువారం ముంబైలోని ఆర్బీఐ ప్రధాన కార్యాలయంలో ద్రవ్యసమీక్ష సందర్భంగా డిప్యూటీ గవర్నర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

# యూపీఐతో 5 లక్షల చెల్లింపు

## ట్యాక్స్ పేమెంట్స్‌కు మాత్రమే..

- ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం
- వరుసగా 9వసారీ కీలక వడ్డీరేట్లు యథాతథం

ముంబై, ఆగస్టు 8: ట్యాక్స్ పేయర్స్ సౌకర్యార్థం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా పన్ను చెల్లింపులకున్న పరిమితిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణనీయంగా పెంచింది. ఏకంగా రూ.5 లక్షలదాకా పెంచుతూ గురువారం ముగిసిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో నిర్ణయించారు. ఇంతకుముందు ఇది లక్ష రూపాయలే. తాజా నిర్ణయం.. నగదు లావాదేవీలను తగ్గించి, యూపీఐ వినియోగాన్ని మరింత పెంచగలదన్న ఆశాభావాన్ని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో పన్ను చెల్లించేవారికి ఇది కలిసొస్తుందని, చిన్నచిన్న మొత్తాల్లో కాకుండా.. చాలామందికి ఒకేసారి ట్యాక్స్ పేమెంట్స్‌కు వీలు చిక్కుతుందని ద్రవ్యసమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. సులువుగా పన్ను బకాయిలను చెల్లించేందుకూ ట్యాక్స్ పేయర్స్‌ను ప్రోత్సహించినట్టవుతుందని అభిప్రాయపడ్డారు. గత ఏడాది డిసెంబర్‌లో దవాఖానలకు, విద్యా సంస్థలకు యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు చెల్లించుకునే సదుపాయాన్ని ఆర్బీఐ ఇచ్చింది. మునుపు ఇది లక్షే.

### డెలిగేటెడ్ పేమెంట్స్

యూపీఐ ద్వారా డెలిగేటెడ్ చెల్లింపుల సదుపాయాన్ని ఆర్బీఐ కొత్తగా పరిచయం చేసింది. దీనివల్ల డిజిటల్ పేమెంట్స్ వినియోగం మరింత లోతుగా జరుగుతుందని చెప్పింది. ఈ సౌకర్యంతో ప్రధాన కస్టమర్.. తన బ్యాంక్ ఖాతా నుంచి తాను నిర్ణయించిన మొత్తాన్నే మరో వ్యక్తి (సెకండరీ యూజర్) యూపీఐ ద్వారా చెల్లించే అవకాశాన్ని ఇవ్వగలరు. ఈ ప్రక్రియలో సెకండరీ యూజర్ యూపీఐకి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా లింకై ఉండాల్సిన అవసరం లేదు.

### హోమ్ లోన్ టాప్-అప్‌లు కఠినం

గృహ రుణాలపై టాప్-అప్‌లు ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున పెరుగుతుండటంపట్ల ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. టాప్-అప్‌ల ద్వారా పొందిన నగదు మొత్తాలను స్టాక్ మార్కెట్ల వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతుండవచ్చన్న అనుమానాల్ని వెలిబుచ్చింది. ఈ క్రమంలోనే హోమ్ లోన్లపై టాప్-అప్‌లు ఇస్తే ఎందుకు వినియోగిస్తున్నారన్నది ఆరా తీయాలని బ్యాంకులకు సూచించింది.


### 6.5 శాతం వద్దే రెపోరేటు

ఈ ద్రవ్యసమీక్షలోనూ రెపోరేటును 6.50 శాతం వద్దే యథాతథంగా ఆర్బీఐ ఉంచింది. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీలో నలుగురు మద్దతు పలికారు. దీంతో వరుసగా 9వ ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉన్నట్టైంది. కాగా, గత ఏడాది ఫిబ్రవరిలో చివరిసారిగా రెపోను పెంచారు. అప్పట్నుంచి అది అక్కడే ఉంటున్నది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై ఈఎంఐలు భారంగానే నడుస్తున్నాయి.

## గంటల్లోనే చెక్ క్లియరెన్స్

*ఇకపై చెక్ క్లియరెన్స్‌లు వేగంగా జరిగిపోనున్నాయి. ప్రస్తుతం చెక్ డిపాజిట్ చేసిన దగ్గర్నుంచి అది క్లియర్ కావడానికి రెండు పనిదినాలు పడుతుండగా.. దీన్ని కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే బ్యాంకులు పూర్తిచేయాలని ఆర్బీఐ గవర్నర్ దాస్ ద్రవ్యసమీక్ష సందర్భంగా ప్రతిపాదించారు. ఇప్పుడు బ్యాచ్ ప్రాసెసింగ్ మోడ్‌లో చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్) కింద చెక్కుల క్లియరెన్స్ జరుగుతున్నది. అయితే ఇకపై సీటీఎస్‌లో 'ఆన్ రియలైజేషన్ సెటిల్మెంట్'తో చెక్ క్లియరెన్సులు జరగాలన్నారు. దీనివల్ల పేమెంట్స్ చేసేవారికి, తీసుకునేవారికి లాభిస్తుందన్నారు.*

# రూపాయీ.. జరభద్రం




*రూపాయి పతనం భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కూ దడ పుట్టిస్తున్నది. చివరకు కరెన్సీ మార్కెట్‌లో బ్యాంకింగ్ ట్రేడింగ్‌కు కళ్లెం వేసేదాకా సెంట్రల్ బ్యాంక్ వెళ్లాల్సి వస్తున్నది. అవును.. రూపీని బలహీనపర్చకండంటూ బడా బ్యాంకులను ఆర్బీఐ వేడుకుందన్న వార్తలు ఇప్పుడు ఒకింత కలవరపాటుకే గురిచేస్తున్నాయి మరి. రూపాయి తలరాతను రాసే కేంద్ర బ్యాంకుకే ఎందుకింతటి ఖర్మ? అంటే అర్థం కాని అయోమయంలో యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థ పడిందిప్పుడు. డాలర్ ముందు రూపాయి నష్టాలు జీవనకాల గరిష్ఠాలను తాకుతుంటే.. మోదీ సర్కారు హయాంలో మారకం విలువ ఏకంగా రూ.23.63 దిగజారడం ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నది.*

## ఆర్బీఐకే దడ పుట్టిస్తున్న దేశీయ కరెన్సీ

- వరుస నష్టాలతో సెంట్రల్ బ్యాంక్‌కు ముచ్చెమటలు
- కరెన్సీ మార్కెట్‌లో జోక్యంతో బడా బ్యాంకులపై ఒత్తిడి
- రూపీకి పోటీగా ట్రేడింగ్ పొజిషన్లు పెంచుకోవద్దని ఆదేశాలు
- ఏం చేసినా ఆగని పతనం.. డాలర్ ముందు తేలిపోతున్న వైనం
- ఆల్‌టైమ్ కనిష్టాన్ని తాకుతూ ఏకంగా 84.09కి క్షీణత
- మోదీ హయాంలో రూ.23.63 క్షీణించిన మారకం విలువ

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రూపాయి క్షీణతను అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శతవిధాలా ప్రయత్నిస్తున్నది. తన వద్దనున్న అన్ని సాధనాలనూ వినియోగించుకుంటున్న సెంట్రల్ బ్యాంక్.. ఆఖరికి సామ, దాన, భేద, దండోపాయాలకూ దిగుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా కరెన్సీ మార్కెట్‌లో రూపీకి పోటీగా తమ ట్రేడింగ్ పొజిషన్లను పెంచుకోవద్దని పలు ప్రముఖ బ్యాంకులకు హుకుం జారీ చేసినట్టు రాయిటర్స్ కథనం చెప్తున్నది. ఈ మేరకు ఎకనామిక్ టైమ్స్, మనీ కంట్రోల్, బిజినెస్ స్టాండర్డ్, సీఎన్‌బీసీ, ఎన్‌డీటీవీ వంటి జాతీయ ప్రధాన వార్తా పత్రికల్లోనూ వచ్చింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజూ పడిపోతూనే ఉండటాన్ని చూస్తూనే ఉన్నాం. సోమవారం స్పాట్ మార్కెట్‌లో మునుపెన్నడూ లేనివిధంగా 84.09 స్థాయికి దిగజారింది. ఆసియా దేశాల్లో గత నెల రోజుల్లో ఇంతలా మరే దేశపు కరెన్సీ విలువ దిగజారింది లేదు. దీంతో అప్రమత్తమైన ఆర్బీఐ.. మంగళవారం అత్యవసరంగా స్పాట్, ఫ్యూచర్స్ మార్కెట్లతోపాటు, నాన్-డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్‌డీఎఫ్) సెగ్మెంట్ లావాదేవీల్లో జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇందులో భాగంగానే పెద్ద బ్యాంకులను ట్రేడింగ్ పొజిషన్లు తగ్గించుకోవాలని సూచించినట్టు ఇప్పుడు తెలియవస్తున్నది. అయితే ఈ పరిణామం అటు కరెన్సీ మార్కెట్‌లో.. ఇటు దేశ ఆర్థిక వ్యవస్థలో గుబులు పుట్టిస్తున్నది. రూపీని నడిపించే ఆర్బీఐనే ఇంతలా గాబరా పడిపోతున్నదేమిటా? అన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### ఇదీ సంగతి..

కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 84 మార్కును దాటకూడదని ఆర్బీఐ గట్టిగానే ప్రయత్నించింది. ఇందుకోసం స్పాట్ మార్కెట్ తెరుచుకోవడానికి ముందే రూ.12,500 కోట్ల విలువైన డాలర్లను ఎన్‌డీఎఫ్ మార్కెట్‌లో అమ్మేసింది. తద్వారా రూపాయిపై ఒత్తిడిని తగ్గేలా చేసింది. నిజానికి ఈ తరహా చర్యలను ఆర్బీఐ ఎప్పుడూ చేస్తూనే ఉంటుంది. అయితే ఓవైపు ఇలా చేస్తూనే.. మరోవైపు బ్యాంకింగ్ కార్యకలాపాలనూ నియంత్రించేందుకు ప్రయత్నించడమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. స్పాట్ మార్కెట్‌లో రూపాయి నష్టాలు.. వర్తకుల ట్రేడింగ్‌కు ఆటంకంగా మారుతున్నది. దీంతో రూపీపై తమ లాంగ్ పొజిషన్లను బలపర్చుకునేందుకు అప్పటికప్పుడు చైనా కరెన్సీ యువాన్ కోసం అంత ఎగబడ్డారు. ఇది ఒక్కసారిగా రూపాయిని బలహీనపర్చింది. అలాగే ఎన్‌డీఎఫ్ మార్కెట్‌లో స్థానిక బ్యాంకులు అదనపు పొజిషన్లు తీసుకున్నకొద్దీ రూపాయిని బలపర్చేందుకు ఆర్బీఐ మరింత శ్రమించాల్సి వస్తుంది. డాలర్లను పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది దేశంలో ఫారెక్స్ నిల్వల్ని దిగజార్చగలదు. అందుకే ఒక స్థాయి వరకే డాలర్లను విడుదల చేసేందుకు ఆర్బీఐ సుముఖత చూపిస్తుంది. ఆ తర్వాతే ఇతర సాధనాలను ఉపయోగిస్తుంది.

### ఇలాగైతే ఎలా?

పడిపోతున్న రూపాయి మారకం విలువ.. ప్రతి ఒక్కరిపైనా ప్రభావం చూపుతుంది. తినే తిండి నుంచి.. వాడే వస్తూత్పత్తి వరకు, తీసుకునే రుణం దగ్గర్నుంచి.. చేసే పొదుపుదాకా అన్నీ ప్రభావితమవుతాయి. ముఖ్యంగా దిగుమతులు భారమైపోతాయి. ఇది దేశంలో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం పెరిగితే.. దాన్ని తగ్గించేందుకు ఆర్బీఐ కఠిన ద్రవ్యవిధానాన్ని అనుసరించాల్సి వస్తుంది. ఫలితంగా బ్యాంకులిచ్చే అన్ని రుణాలపై వడ్డీరేట్లు పెరుగుతాయి. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజానీకమే ఎక్కువగా ఉన్న మన దేశంలో వినిమయ శక్తి దెబ్బతింటుంది. కొనుగోళ్లు లేక మార్కెట్‌లో వ్యాపారాలు కుంటుబడుతాయి. తద్వారా ఉత్పత్తి మందగిస్తుంది. పెట్టుబడులు రాక కీలక రంగాల్లో నిస్తేజం ఆవరిస్తుంది. ఉద్యోగ-ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి. చివరకు దేశ ఆర్థిక వృద్ధిరేటు ఆగిపోతుంది. అందుకే ఏ దేశానికైనా దాని కరెన్సీనే ఆయువుపట్టు కానీ ఇప్పుడు రూపాయి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టు తయారైంది.

## మోదీ హయాంలో రూపాయికి దెబ్బ

కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి రూపాయి పతనం కొనసాగుతూనే ఉన్నది. దేశ ఆర్థిక వ్యవస్థకు కొలమానంగా భావించే రూపీ ఎంతకీ లేవలేని దుస్థితికి దిగజారిందన్నా అతిశయోక్తి కాదు. 2014లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 60.34గా ఉన్నది. ఇప్పుడిది 83.97గా నమోదైంది. అంటే గడిచిన పదేండ్లకుపైగా కాలంలో రూపాయి విలువ ఏకంగా 23.63 మేర క్షీణించింది. అంతకుముందు మన్మోహన్ సింగ్ పాలనలోనూ రూపాయి పడిపోయినప్పటికీ.. ఇంతకన్నా తక్కువే. ఆ పదేండ్లలో 15.97 మేర దిగజారింది. అయితే అప్పటితో చూస్తే ఇప్పుడే కరెన్సీ మార్కెట్‌లో ఒడిదొడుకులు ఎక్కువయ్యాయి. ఇందుకు అంతర్జాతీయ పరిణామాలు కారణమైనా.. దేశీయ పరిస్థితులూ హేతువేనన్నది కాదనలేని సత్యం.

## 21న టీ హబ్‌లో హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో ఈనెల 21న టీహబ్‌లో హ్యాకథాన్‌ను నిర్వహించబోతున్నారు. ఇంజనీరింగ్, కోడింగ్ అంశాలపై ఔత్సాహికులకు ఉదయం 9-రాత్రి 9 గంటల వరకు హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు టీహబ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ లింకు (https://bit.ly/ 4d9naxb)లో సంప్రదించాలని సూచించారు. విజేతలుగా ఎంపికైన వారికి హెచ్‌ఎస్‌బీసీలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుంది.

## ఎల్ఐసీ లాభం 10,461 కోట్లు




న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) ఆశాజనక పనితీరు కనబరిచింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.10,461 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9,544 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం ఎగబాకినట్లు కంపెనీ వెల్లడించింది. అటు ఆదాయం కూడా రూ.1,88,749 కోట్ల నుంచి రూ.2,10,910 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. గత త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయంలో తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.6,811 కోట్ల నుంచి రూ.7,470 కోట్లకు పెరగగా, రెన్యూవల్ ప్రీమియం వసూళ్లు రూ.53,638 కోట్ల నుంచి రూ.56,429 కోట్లకు, అలాగే పలు సంస్థల్లో పెట్టుబడుల రూపంలో రూ.96,183 కోట్లు సమకూరినట్లు తెలిపింది.

## ఫెడరల్ బ్యాంక్ విస్తరణ

హైదరాబాద్, ఆగస్టు 8: ఫెడరల్ బ్యాంక్ తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని శాఖలు ఏర్పాటుచేయబోతున్నది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీల్లో 78 శాఖలు ఉండగా, వచ్చే ఏడాదిన్నరలోగా ఈ శాఖల సంఖ్యను 100కి పెంచుకోనున్నట్లు బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్ తెలిపారు. ప్రస్తుతేడాది 10 నుంచి 12 శాఖలను ప్రారంభించనుండగా, వచ్చే ఏడాది కూడా ఇంతే స్థాయిలో బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు హైదరాబాద్‌లోకి అడుగుపెట్టి 50 ఏండ్లు పూర్తైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చెప్పారు.

## 'నైనీబ్లాకులో చెట్ల గణన'

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఒడిశాలో నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియకు సహకరించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజాను సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ కోరారు. 10 రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ చేపడతామని ఆయన హామీ ఇచ్చినట్టు సీఎండీ వెల్లడించారు. బుధవారం భువనేశ్వర్‌లో కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కొత్త బ్లాక్‌ల స్థితిగతులపై నిర్వహించిన సమావేశంలో సీఎండీ మాట్లాడారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.